క్లుప్తంగా

తాగునీరు వృథా



లీకేజీ నీటితో వాగులా మారిన రోడ్డు

అల్లాదుర్గం(మెదక్): మిషన్ భగీరథ పథకం ద్వారా గ్రామీణ ప్రాంతాలకు స్వచ్ఛమైన తాగునీరు పభుత్వం అందిస్తోంది. మూడు రోజులుగా పైపులైన్ లీకేజీతో నీరు వృథాగా పోతున్నా.. సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. మండల పరిధిలోని గడిపెద్దాపూర్ చౌరస్తా వద్ద మిషన్ భగీరథకు చెందిన పైపు లీకేజీ అవుతోంది. తాగు నీరంతా రోడ్డుపై వాగులా పారుతోంది. రోడ్డుపై నీరు పారుతుండటంతో ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి వెంటనే చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

అనుమతి లేకుండా మట్టి తరలింపు

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని తునికి పంచాయతీ పరిధిలో గుట్ట నుంచి ఎలాంటి అనుమతి లేకుండానే అక్రమంగా మట్టి తరలిస్తున్నారు. నర్సాపూర్ మండలంలోని ఓ గ్రామంలో పామ్‌లాండ్ అభివృద్ధి కోసం, వెంచర్లు చేసేందుకు రాత్రిపూట మట్టిని టిప్పర్ల ద్వారా తరలిస్తున్నట్లు సమాచారం. దీంతో పాటు తునికి శివారులో నూతనంగా వేస్తున్న వెంచర్‌లోకి సైతం మట్టిని తరలిస్తున్నారు. నాయకుల అండదండలతోనే మట్టి అక్రమ రవాణా జరుగుతోందని, దాన్ని అడ్డుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఈ విషయమై తహసీల్దార్ ఆంజనేయులు వివరణ కోరగా.. మట్టి తరలింపులో ఎవరికి ఎలాంటి అనుమతి ఇవ్వలేదన్నారు. అనుమతి లేకుండా మట్టి తరలింపు సరికాదన్నారు. ఈ విషయమై విచారణ చేసి, చర్యలు తీసుకుంటామని చెప్పారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు



పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యుడు

శివ్వంపేట(నర్సాపూర్): ఆరోగ్యంపై ప్రతీ విద్యార్థి ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని శివ్వంపేట ఉన్నత పాఠశాల హెచ్‌ఎం బాలచంద్రం అన్నారు. మంగళవారం లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ గ్రేటర్ బంజారా ఆధ్వర్యంలో విద్యార్థులకు దంత పరీక్షలు నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు దంతాల శుభ్రత గురించి వివరించి, అవసరం ఉన్న మందులు ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ గ్రేటర్ బంజారా అధ్యక్షుడు లయన్ సంతోష్‌కుమార్, దంత వైద్యుడు వీర కల్యాణ్‌గౌడ్, ఉపాధ్యాయులు నర్సింహాశర్మ, చంద్రమోహన్, రాధతో పాటు తదితరులు ఉన్నారు.

ఎస్జీటీలకు ఓటుహక్కు కల్పించాలి



మాసాయిపేటలో సభ్యత్వ నమోదును అందజేస్తున్న పోచయ్య

వెల్దుర్తి(తూప్రాన్): ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎస్జీటీలకు ఓటు హక్కు కల్పించాలని ఎస్టీయూ టీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పోచయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు మాసాయిపేట మండలంలో పర్యటించి సెకండరీ గ్రేడ్ టీచర్స్ యూనియన్ టీఎస్ సభ్యత్వ నమోదు చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఉద్యోగ, ఉపాధ్యాయులకు సంబంధించి ఐదు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని విడుదల చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు శివప్రసాద్, శ్రీనివాసచారి, సత్యనారాయణ, రాజేశ్వర్, రవి, నాగరాజు, సుజన తదితరులు పాల్గొన్నారు.

కళాశాలలో శ్రమదానం



శ్రమదానం చేస్తున్న విద్యార్థులు

రామాయంపేట(మెదక్): రామాయంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్లు శ్రమదానం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు కళాశాల చుట్టుపక్కల పేరుకపోయిన చెత్తా చెదారాన్ని తొలగించి శుభ్రం చేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ హిమజ్యోతి మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు సమాజసేవలో ముందుండాలని సూచించారు. పచ్చదనం, పరిశుభ్రతపై గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారి బాలగౌడ్, ఇతర అధ్యాపకులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత తప్పనిసరి

● మెదక్ మున్సిపల్ కమిషనర్ జానకీరాంసాగర్



మెదక్ మున్సిపాలిటీ: మొక్క నాటుతున్న మున్సిపల్ అధికారులు

మెదక్ మున్సిపాలిటీ: ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని మున్సిపల్ కమిషనర్ జానకీరాంసాగర్ పేర్కొన్నారు. మంగళవారం మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ మల్లికార్జున్ ఆధ్వర్యంలో పట్టణంలోని 1, 9, 18వ వార్డుల్లో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలకు తడి, పొడి చెత్త వేరు చేయడం, పరిశుభ్రత గురించి అవగాహన కల్పించారు. అనంతరం గీతా స్కూల్‌లో విద్యార్థులతో స్వచ్ఛతపై ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ భీమరి కిశోర్‌కుమార్, హెల్త్ అసిస్టెంట్ మహేశ్, ఎన్విరాన్‌మెంట్ ఇంజినీర్ వెంకటేష్, సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: ఎంపీడీఓ రఘు

హవేళిఘణాపూర్(మెదక్): సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీఓ రఘు అన్నారు. మంగళవారం మండల పరిధిలోని కొంటూర్‌లో జరుగుతున్న పరిశుభ్రత పనులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రజలు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించడం ద్వారా అందరూ ఆరోగ్యంగా ఉండేందుకు ఆస్కారం ఉంటుందన్నారు. అందుకోసం పంచాయతీ సిబ్బంది మురికి కాల్వలు శుభ్రం చేస్తారని అన్నారు. ముందస్తుగా ప్రజలు వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ నర్సింలు తదితరులు ఉన్నారు.

ప్లాస్టిక్ రహిత సమాజం కోసం కృషి



నిజాంపేట(మెదక్): విద్యార్థులతో మాట్లాడుతున్న డీపీఓ యాదయ్య



హవేళిఘణాపూర్(మెదక్): పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ రఘు

నిజాంపేట(మెదక్): ప్లాస్టిక్ రహిత సమాజం కోసం ప్రతీ ఒక్కరూ ముందడుగు వేయాలని డీపీఓ యాదయ్య అన్నారు. మండల కేంద్రంతో పాటు నస్కల్ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాన్ని డీపీఓ సందర్శించారు. ఈ మేరకు మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు స్వచ్ఛతపై అవగాహన కల్పించి, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. విద్యార్థులు ప్లాస్టిక్ వాటర్ బాటిళ్లతో వాటర్ తాగొద్దని సూచించారు. ప్రతీ ఒక్కరూ మొక్కలను పెంచాలని తెలిపారు. అనంతరం మధ్యాహ్న భోజనం పరిశీలించి విద్యార్థులకు మంచి భోజనం అందించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రాజిరెడ్డి, ఎంపీఓ ప్రవీణ్ కుమార్, శరత్, పాఠశాల హెచ్‌ఎం జ్ఞానమాల, ఉపాధ్యాయులు రజిని, మన్మథ, రాజయ్య, వెంకటేశం విద్యార్థులు పాల్గొన్నారు.

పాపన్నపేట పాఠశాలలో స్వచ్ఛత పోటీలు

పాపన్నపేట(మెదక్): స్వచ్ఛతాహీ సేవలో భాగంగా పాపన్నపేట ఉన్నత పాఠశాలలో ఎంపీడీఓ విష్ణువర్ధన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు పాటలు, నృత్య పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చిన్నప్పటి నుంచే వ్యక్తిగత పరిశుభ్రత కలిగి ఉండాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, స్వచ్ఛతపై అందరికీ అవగాహన కల్పించాలని సూచించారు. పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందించారు. పాఠశాల హెచ్‌ఎం మహేశ్వర్, ఎంపీఓ పరమేశ్, గ్రామ కార్యదర్శి నయీమ్, ఉపాధ్యాయులు నాగరాజు, అంజాగౌడ్, యాదయ్య, ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది వెంకట్ పాల్గొన్నారు.

నార్సింగిలో ..

చిన్నశంకరంపేట(మెదక్): పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలని నార్సింగి ఎంపీడీఓ ఆనంద్ తెలిపారు. మంగళవారం నార్సింగి బీసీ హాస్టల్‌లో స్వచ్ఛత హీ సేవ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్లాస్టిక్ రహిత సమాజం కోసం విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఈఓ నాగభూషణం, హాస్టల్ వార్డెన్ సుజాత పాల్గొన్నారు.

చిలప్‌చెడ్‌లో..

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో ఎంపీడీఓ ఆనంద్ పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామంలో పలుచోట్ల స్వచ్ఛతపై అవగాహనకు పెయింటింగ్‌లు వేయించామన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ శ్యామ్, పంచాయతీ కార్యదర్శి కృష్ణ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సంతోషిమాత, తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛతతే లక్ష్యమంటున్న విద్యార్థులు

మనోహరాబాద్(తూప్రాన్): మండల పరిధిలోని పాలాట ప్రాథమికోన్నత పాఠశాలలో స్వచ్ఛత సేవ కార్యక్రమాన్ని విద్యార్థులు నిర్వహించారు. స్వచ్ఛత హీ సేవలో భాగంగా విద్యార్థులు వేడుకలు నిర్వహించారు. అనంతరం పాఠశాలను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం తిరుపతిరెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులకు స్వచ్ఛత, పరిశుభ్రతపై అవగాహన కల్పించారు.

చేతులు శుభ్రంగా చేసుకోవాలి

● ఎంపీడీఓ శ్రీనివాస్



కౌడిపల్లి ఉన్నత పాఠశాలలో ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, విద్యార్థులు

కౌడిపల్లి(నర్సాపూర్): ప్రతీ ఒక్కరూ చేతులు శుభ్రంగా చేసుకోవాలని, పరిసరాల పరిశుభ్రతను పాటించాలని ఎంపీడీఓ శ్రీనివాస్ పేర్కొన్నారు. స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమంలో భాగంగా మంగళవారం కౌడిపల్లి ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి స్వచ్ఛత ప్రతిజ్ఞ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతను పాటించాలన్నారు. విద్యార్థి దశ నుంచే పరిశుభ్రతపై అవగాహన కలిగి ఉండాలన్నారు. పారిశుద్ధ్యం లోపిస్తే వ్యాధుల భారిన పడతామన్నారు. భోజనానికి ముందు, బహిర్భూమికి తర్వాత సబ్బుతో చేతులు కడుక్కోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీఓ కలీముల్ల, హెచ్‌ఎం పద్మజ, కార్యదర్శి వెంకటేశం, కారోబార్ ఎల్లం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నివారణ చర్యలతో వరిసాగు భేష్

● ఏరువాక శాస్త్రవేత్త డాక్టర్ వర్మ



చండూర్‌లో వరిసాగును పరిశీలిస్తున్న ఏరువాక శాస్త్రవేత్తలు వర్మ, సరిత

చిలప్‌చెడ్(నర్సాపూర్): సరైన నివారణ చర్యలతో వరిసాగు బాగుండడంతో పాటు అధిక దిగుబడి సాధించవచ్చని ఏరువాక శాస్త్రవేత్త డాక్టర్ వర్మ అన్నారు. మంగళవారం ఆయన మండలంలోని చండూర్ గ్రామానికి చెందిన చౌటకూరి చంద్రశేఖర్ రెడ్డికి అందించిన పలు రకాల సన్నరకం చిరుసంచుల వరిసాగును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చంద్రశేఖర్‌రెడ్డికి అందించిన కేపీఎస్- 10361, కేఎన్‌ఎం-12368 అనే రకాలు ప్రస్తుతం చాలా బాగున్నాయన్నారు. కాగా సెప్టెంబర్‌లో కురిసిన వర్షాలతో వరిలో చీడపీడలు గమనించామన్నారు. గింజ మచ్చ రావడానికి ఆస్కారం ఉన్నందున నాటీవో 80 గ్రాములు ఎకరానికి పిచికారీ చేసుకోవాలన్నారు. అదేవిధంగా వరిలో కాండం తొలుచు పురుగు, ఆకుముడత గమనించినట్టైతే కొరాజిన్ 60 ఎంఎల్ లేదా కెల్‌డాన్ 400 గ్రాములు ఎకరానికి చిరుపొట్ట దశలో పిచికారీ చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏరువాక శాస్త్రవేత్తలు డాక్టర్ కిరణ్, సరిత, ఏఓ రాజశేఖర్, ఏఈఓలు కృష్ణవేణి, భూపాల్, రైతులు చంద్రశేఖర్‌రెడ్డి, దయాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

అధికార దాహం తీరని కేటీఆర్

● పీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి రామచందర్‌గౌడ్



మాట్లాడుతున్న రామచందర్‌గౌడ్

రామాయంపేట(మెదక్): బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌కు ఇంకా అధికార దాహం తీరలేదని పీసీసీ అధికార ప్రతినిధి రామచందర్‌గౌడ్ ఆరోపించారు. ఆయన మంగళవారం మాట్లాడుతూ.. అభివృద్ధి గురించి ఎంతమాత్రం పట్టించుకోకుండా తనను గెలిపించిన సిరిసిల్లా ప్రజలను కేటీఆర్ మోసగిస్తున్నాడని ఆరోపించారు. సమస్యలు ఎంతమాత్రం పట్టించుకోకపోవడంతోనే ప్రజలు బీఆర్‌ఎస్‌ను గద్దె దింపారని అన్నారు. తమ ఎమ్మెల్యే కనిపించడం లేదని సిరిసిల్లా ప్రజలు అక్కడి పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశారంటే ఆయన పరిస్థితి ఏమిటో అర్థం అవుతుందని ఎద్దేవా చేశారు. సీఎం రేవంత్‌రెడ్డిని ఇష్టం వచ్చినట్లు కేటీఆర్ విమర్శించడం సరికాదని స్పష్టం చేశారు.

గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

● మైనంపల్లి హన్మంత్‌రావు



కార్యకర్తలతో మాట్లాడుతున్న మైనంపల్లి

శివ్వంపేట(నర్సాపూర్): రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులు గెలుపే లక్ష్యంగా పనిచేయాలని కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంత్‌రావు అన్నారు. మండల పరిధిలోని గోమారంలో ఆదివారం రాత్రి చోటు చేసుకున్న సంఘటన దృష్ట్యా మంగళవారం కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో మాట్లాడారు. బీఆర్‌ఎస్ నాయకుల బెదిరింపులకు భయపడేది లేదని కార్యకర్తలకు ఏ ఆపద వచ్చినా.. అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, కాంగ్రెస్ నర్సాపూర్ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి, గోమారం మాజీ సర్పంచ్ లావణ్య, పీఏసీఎస్ చైర్మన్ వెంకట్‌రామిరెడ్డి, నాయకులు మాధవరెడ్డి, కర్ణకర్‌రెడ్డి, నర్సింహారెడ్డి, శ్రీనివాస్, బుచ్చిరెడ్డి, హన్మంత్‌రెడ్డి, సుధీర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ఈజీఎస్ రికార్డులు సక్రమంగా నమోదు చేయాలి

పెద్దశంకరంపేట(మెదక్): ఉపాధిహామీ పథకంలో రికార్డులను సక్రమంగా నమోదు చేయాలని ఉపాధిహామీ కేంద్ర ఆడిటింగ్ జనరల్ మాలకొండయ్య అన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ కార్యదర్శులు, టీఏలు, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఈజీఎస్ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పనులు, రికార్డులు, ఈజీఎస్ క్యాష్ బుక్ నిర్వాహణ సక్రమంగా చేపట్టాలని, నిర్లక్ష్యం వహించొద్దని సూచించారు. కార్యక్రమంలో ఆడిటర్లు శ్రీనివాస్, వంశీకృష్ణ, ముజీద్ మన్సార్ అలీ, ఎంపీడీఓ రఫీఖ్‌ఉన్నీసా, ఎంపీఓ విఠల్‌రెడ్డి, ఈజీఎస్ ఏపీఓ నవాజుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

కుంటలను కాపాడండి

నర్సాపూర్: మండలంలోని పెద్దమ్మ తండా పరిధిలోని పలు కుంటలను కాపాడాలని గిరిజనులు మంగళవారం సాగునీటి పారుదల శాఖ అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ మేరకు వారు మాట్లాడుతూ.. తండా పరిధిలోని కొత్తకుంట, పాపాకుంటలకు చెందిన శిఖం, కట్ట కబ్జాల పాలవుతుందని వివరించారు. హైదరాబాద్‌కు చెందిన ఓ వ్యక్తి కుంటల పక్కన భూమి కొనుగోలు చేసి కుంటలకు చెందిన శిఖం తదితర భూమిని కబ్జా చేశారని ఆరోపించారు. కుంటల కింద సాగు భూములు ఉన్నాయని, కుంటలు కబ్జా కావడంతో తమ భూములు సాగు చేయడానికి ఇబ్బందుల పాలవుతున్నామని వాపోయారు. కబ్జాదారుల నుంచి కుంటలను కాపాడాలని గిరిజన రైతులు శంకర్, శ్రీనివాస్, రాజు తదితరులు కోరారు.

మానసికంగా, ఆర్థికంగా కుంగిపోతున్నాం

● నిధులు మంజూరు చేయాలి: పంచాయతీ కార్యదర్శులు



ఎంపీడీఓకు వినతిపత్రం అందిస్తున్న పంచాయతీ కార్యదర్శులు

హవేళిఘణాపూర్(మెదక్): పంచాయతీల్లో నిధుల్లేక మానసికంగా, ఆర్థికంగా కుంగిపోతున్నామని మండలంలోని గ్రామ పంచాయతీ కార్యదర్శులు ఎంపీడీఓ రవీశ్వర్‌గౌడ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అధికారులు ఎలాగైనా పనులు చేయాలన్న ఒత్తిడితో నెలల తరబడి పనులు చేసిన తమకు డబ్బుల్లేక ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఒకవైపు ప్రజలు గ్రామంలో ఏ పని చేయకున్నా.. తమపై తిరగబడుతున్నారని, ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు చెబితే వారికి మీరే చేసుకోవాలని చెప్పాలన్నారు. దీంతో కొన్ని నెలలుగా తమ వేతనంతో పాటు బంగారు నగలు కూడా బ్యాంకుల్లో కుదువ పెట్టి అప్పులు చేశామని తెలిపారు. అయినప్పటికీ దుకాణాల్లో బకాయిలు, బయట పంచాయతీ అవసరాల కోసం తీసుకొచ్చిన సామన్ల డబ్బులు చెల్లించక మానసికంగా, ఆర్థికంగా కుంగిపోతున్నామని వాపోయారు. ఉన్నతాధికారులు తమ ఇబ్బందులను గుర్తించి వెంటనే నిధులు మంజూరు చేసి, గ్రామ పాలన సాఫీగా సాగేందుకు కృషి చేయాలని ఎంపీడీఓకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. కార్యక్రమంలో మండలంలోని ఆయా గ్రామాల పంచాయతీ సెక్రటరీలు ఉన్నారు.

వ్యర్థ జలాలతో పంటలకు తీవ్రనష్టం

● కెమికల్ పరిశ్రమ ఎదుట రైతులు ఆందోళన



పరిశ్రమ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు

శివ్వంపేట(నర్సాపూర్): కెమికల్ పరిశ్రమ నుంచి వదులుతున్న వాయు కాలుష్యం, వ్యర్థ జలాలతో పంటలు పాడైపోతున్నాయని రైతులు పరిశ్రమ ఎదుట మంగళవారం ఆందోళన చేశారు. మండలంలోని నవాబుపేట గ్రామ పరిధిలో వాసుదేవా కెమికల్ పరిశ్రమ ఉంది. దీని నుంచి నిత్యం నిబంధనలకు విరుద్ధంగా వ్యర్థ జలాలు వదులుతుండడంతో పరిసర ప్రాంతాల్లో వేసిన పంటలు మాడి మసైపోతున్నాయని రైతులు ఇంద్రసేనరెడ్డి, కృష్ణరెడ్డి, నర్సింలు, రాఘవరెడ్డి, సంతోష్, బాల్‌రెడ్డి ఆరోపించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పరిశ్రమ నుంచి వచ్చే వాయు కాలుష్యం, వ్యర్థ జలాలతో పంటలు పాడైపోతున్నాయని పలుమార్లు పరిశ్రమ యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లినా.. పట్టించుకోవడం లేదన్నారు. వాయు కాలుష్యం పంటపై మంచు దుప్పటి కప్పేయడంతో తీవ్ర దుర్వాసన వస్తుండడంతో పొలం వద్ద పనులు చేసుకోలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో పీసీబీ అధికారులకు ఫిర్యాదు చేయగా, కొన్నాళ్లపాటు సక్రమంగా నిర్వహించినప్పటికీ.. మళ్లీ మొదటికి వచ్చిందని వాపోయారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి పరిశ్రమపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పీఆర్‌టీయూ బలోపేతానికి కృషి



పీఆర్‌టీయూ నూతన కమిటీ సభ్యులు

రేగోడ్(మెదక్): పీఆర్‌టీయూ బలోపేతానికి తనవంతు కృషి చేస్తానని రెండోమారు నూతనంగా ఏకగ్రీవంగా ఎన్నికైన పీఆర్‌టీయూ మండలాధ్యక్షుడు అంజుబాబు అన్నారు. మండల కేంద్రం రేగోడ్‌లో మంగళవారం పీఆర్‌టీయూ మండల స్థాయి సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించి, మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా కమిటీ ఎన్నికల నిర్వహణ అధికారి జనార్ధన్ మాట్లాడారు. ప్రధాన కార్యదర్శిగా రాజు, మహిళా ఉపాధ్యక్షురాలిగా సుశీల, అసోసియేట్ అధ్యక్షుడిగా పరిపూర్ణం, కార్యదర్శిగా సంజీవులును ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో జిల్లా బాధ్యులు వెంకన్న, భస్వరాజ్, ఈశ్వరప్ప, మండల బాధ్యులు స్వయం ప్రభ, విజయ్ కుమార్, మంగ్య, కల్పన, సందీప్, పంతులు కృష్ణ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **కవితల పోటీలు**

చేగుంట(తూప్రాన్): మండల కేంద్రం చేగుంటలోని మోడల్ పాఠశాలలో జీఎంఆర్ వరలక్ష్మి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం కవితల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా జీఎంఆర్ ప్రోగ్రాం మేనేజర్ భారతి మాట్లాడుతూ.. తెలుగు భాష దినోత్సవం పురస్కరించుకొని విద్యార్థులకు కవితల పోటీలను నిర్వహించినట్లు తెలిపారు. పోటీల్లో ప్రతిభను కనబర్చిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమలో ప్రిన్సిపాల్ చంద్రకళ, ప్రోగ్రాం ఎగ్జిక్యూటివ్ శ్రీనివాస్ పాఠశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

◆ **పాత చట్టాలను అమలు చేయాలి**

నర్సాపూర్: పాత కార్మిక చట్టాలను అమలు చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నందం, జిల్లా కమిటీ సభ్యులు భిక్షపతి, స్వామి అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కొత్తగా తెచ్చిన నాలుగు లేబర్‌కోడ్ చట్టాలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్మికులు అనేక పోరాటాలు చేసి సాధించుకున్న చట్టాలను కాపాడాలని కోరారు.

◆ **ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన**

చిన్నశంకరంపేట(మెదక్): ఆర్థిక అక్షరాస్యతపై ప్రతీ ఒక్కరికి అవగాహన ఉండాలని ఎస్‌బీఐ సీఎఫ్‌ఎల్ ప్రతినిధి నాగేందర్ అన్నారు. మంగళవారం చిన్నశంకరంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు ఆర్థిక అక్షరాస్యత ప్రాముఖ్యతను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బ్యాంకింగ్ సేవలు, ఆర్‌బీఐ రూల్స్‌ను తెలిపారు. మారుతున్న కాలంలో డిజిటల్ బ్యాంకింగ్ సేవలు, జాగ్రత్తలను చెప్పారు. ఈ కార్యక్రమంలో సీఎఫ్‌ఎల్ అధికారి సుధాకర్, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శశిధర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

◆ **చాకరిమెట్ల హుండీ ఆదాయం రూ.6 లక్షల 70 వేలు**

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని చాకరిమెట్ల సహకార ఆంజనేయస్వామి ఆలయ హుండీని మంగళవారం భక్తుల సమక్షంలో లెక్కించారు. 5 నెలల 24 రోజులకు సంబంధించి ఆలయ హుండీ ఆదాయం రూ.6 లక్షల 77 వేల 762లు వచ్చినట్లు ఈఓ శ్రీనివాస్, ఆలయ ఫౌండర్, చైర్మన్ ఆంజనేయశర్మ తెలిపారు. ఈ కార్యక్రమంలో పరిశీలకులు రంగారావు, ప్రధాన అర్చకులు దేవదత్తశర్మ, గ్రామస్తులు నారాయణరావు, భ్రమరాంభ సేవా సమితి సభ్యులు ఉన్నారు.

◆ **ఫర్టిలైజర్ షాపుల తనిఖీ**

హవేళిఘణాపూర్(మెదక్): మండల పరిధిలోని ఆయా గ్రామాల్లోని ఫర్టిలైజర్ షాపులను మంగళవారం ఏఓ బాల్‌రెడ్డి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దుకాణంలో ఉన్న ఫర్టిలైజర్ మందులను నాణ్యత పరీక్షల కోసం పంపినట్లు తెలిపారు. మండల పరిధిలోని ఫరీద్‌పూర్, కూచన్‌పల్లితో పాటు ఆయా గ్రామాల్లోని ఎరువుల దుకాణాలను తనిఖీ చేశామన్నారు. కాలం చెల్లిన మందులు, నాసిరకమైన మందులు అమ్మినట్లు తేలితే వారిపై చర్యలు తీసుకుంటామని అన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు బ్రహ్మం, ఫర్టిలైజర్ నిర్వాహకులు ఉన్నారు.

◆ **సూరారంలో టేకు చెట్టుపై పిడుగు**

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని సూరారం గ్రామంలోని మజీద్ పక్కన ఉన్న టేకు చెట్టుపై పిడుగు పడింది. మంగళవారం మధ్యాహ్నం ఉరుములు మెరుపులతో వర్షం వచ్చింది. అదే సమయంలో టేకుపై పిడుగుపడడంతో చెట్టు రెండుగా చీలిపోయింది.

◆ **ఘనంగా సీతారాం ఏచూరి సంస్మరణ సభ**

వెల్దుర్తి(తూప్రాన్): మండలంలోని బండపోసాన్‌పల్లి గ్రామంలో కమ్యూనిస్ట్ యోధుడు సీతారాం ఏచూరి సంస్మరణ సభ సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి మల్లేశం, మండల కార్యదర్శి గౌరి, పోచయ్య తదితరులు పాల్గొన్నారు.

◆ **బీజేపీ సభ్యత్వ నమోదు**

టేక్మాల్(మెదక్): బీజేపీ సంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి అనంతరావు కులకర్ణి ఆధ్వర్యంలో మండలంలోని తంప్లూర్‌లో మంగళవారం పార్టీ సభ్యత్వ నమోదు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్యకర్తలు క్షేత్రస్థాయిలో పార్టీ అభిమానులతో సభ్యత్వం నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు జగదీశ్ పాటిల్, అసెంబ్లీ కన్వీనర్ మఠం చంద్రశేఖర్, ఎల్లుపేట రాజు, టేక్మాల్ మండల ప్రధాన కార్యదర్శి సిద్ధిరాములు, ఉపాధ్యక్షుడు రాములు, యువ మోర్చా అధ్యక్షుడు పవన్, గిరిజన మోర్చా అధ్యక్షులు సేనాపతి, తంప్లూర్ బూత్ అధ్యక్షులు శ్రీకాంత్ గౌడ్, వినోద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

◆ **టీపీటీఎఫ్ మండలాధ్యక్షుడిగా మాధవచౌదరి**

కౌడిపల్లి(నర్సాపూర్): టీపీటీఎఫ్ మండలాధ్యక్షుడిగా మాధవచౌదరిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మంగళవారం కౌడిపల్లి మండల టీపీటీఎఫ్ నూతన కార్యవర్గాన్ని జిల్లా అధ్యక్షుడు సంగయ్య, రాష్ట్ర ఆడిట్ కమిటీ కన్వీనర్ యాదగిరి ఆధ్వర్యంలో ఎన్నుకున్నట్లు ఆయన చెప్పారు. ప్రధాన కార్యదర్శిగా రాంసింగ్, ఉపాధ్యక్షుడిగా కృష్ణమూర్తి, కార్యదర్శులుగా రమేశ్, లక్ష్మీప్రసాద్, రాజేశ్వరీ, జిల్లా కౌన్సిలర్‌గా వెంకటేశ్వర్లతో పాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నట్లు చెప్పారు

◆ **రహదారిపై గుంతల మూసివేత**



పెద్దశంకరంపేట(మెదక్): మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌక్ వద్ద ఇటీవల కురిసిన వర్షాలకు భారీగా గుంతలు పడడంతో ఎస్ఐ.శంకర్ గుంతలను మట్టితో పూడ్చివేయించారు. మంగళవారం గుంతలపై మట్టి వేసి చదును చేయించారు. దీంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమంలో హెడ్‌కానిస్టేబుల్ విఠల్ తదితరులు ఉన్నారు.

◆ **వినాయక లడ్డూను దక్కించుకున్న ముస్లిం యువకుడు**



కౌడిపల్లి(నర్సాపూర్): వినాయకుడి లడ్డూను ముస్లిం యువకుడు వేలం పాట ద్వారా దక్కించుకున్నాడు. మండల కేంద్రం కౌడిపల్లిలో మార్కెట్ యార్డు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుడిని సోమవారం రాత్రి నిమజ్జనం చేశారు. కాగా లడ్డువేలం వేయగా గ్రామానికి చెందిన ఎస్‌కే మక్బుల్ రూ. 36,616కు వేలంపాటలో దక్కించుకున్నారు. మరోలడ్డూను జనార్ధన్ రూ. 7,001కి వేలంలో దక్కించుకున్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు నవీన్‌కుమార్, శ్రీనివాస్, మురళి, దుర్గాగౌడ్, దుర్గయ్య, బీమేశ్, దశరథ్, నాగరాజ్ తదితరులు పాల్గొన్నారు.

◆ **ఎస్టీయూ సభ్యత్వ నమోదు**

నిజాంపేట(మెదక్): ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించడం కోసం ఎస్టీయూ సంఘం జిల్లా నాయకులు అశోక్ మండలంలోని నందగోకుల్ గ్రామంలో సభ్యత్వ నమోదు నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గణేశ్, దశరథం, సత్యం తదితరులు పాల్గొన్నారు.